మూవీమ్యాక్స్ - మౌలాలి 9.10,12.40,4.10,7.45,11.15
జె.పి.సినిమాస్ - చందానగర్ 10.15,1.20,4.30,7.40,10.40
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 1.20,10.45

GLOBAL CINEMAS RELEASE

బాస్కెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలి

- బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలు



ఉమ్మడి జిల్లా మహిళా బాస్కెట్‌బాల్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 6 : రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని బాస్కెట్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు మక్సూద్‌బిన్ అహ్మద్ జాకీర్ సూచించారు. ఈ నెల 14, 15 తేదీల్లో సికింద్రాబాద్ జింఖాన మైదానంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీ పాల్గొనే ఉమ్మడి జిల్లా మహిళ జట్టు ఎంపికలను ఆదివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నసూరుల్లా హైదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్ ఖలీద్ అలీ, జాయింట్ సెక్రటరీ మహ్మద్ ఇలియాజ్, ఫారుక్‌ముక్రం, కోచ్ ఖలీల్ పాల్గొన్నారు. జట్టుకు ఎంపికైన వారిలో జ్యోతి, కె.ప్రియాంక, అర్పిత, శ్రీవల్లిక, భువనేశ్వరి, సాయినిఖిత, హర్షిత, చైత్ర, శ్రీలత,హారిణి, మేఘన, వైష్ణవి ఉన్నారు.

ఇద్దరిని ఢీ కొట్టిన గుర్తుతెలియని వాహనం

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

జడ్చర్ల, అక్టోబరు 6 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల క్రాస్‌రోడ్డులోని ఫ్లైఓవర్‌పై శనివారం రాత్రి నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం, గరియా బాద్ జిల్లా సవాపర గ్రామానికి చెందిన ముర్త తన కుటుంబంతో కలిసి జీవనోపాధి కోసం 15 రోజుల క్రితం జడ్చర్లకు వచ్చారు. జాతీయ రహదారిపై ఉన్న ఓ హోటల్ సమీపంలో ఇటుక బట్టీలో కూలీ పనులు చేసుకుంటున్నారు. అదే ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిచ్‌పరా చెందిన కాలురామ్‌తో కలిసి ముర్త శనివారం అర్ధరాత్రి ఇటుకబట్టీ నుంచి జడ్చర్లకు వెళ్లి, ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముర్త తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కాలురామ్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ తరలించారు. ముర్త కుమారుడు రాంనారాయణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇంట్లో నగదు, ఆభరణాలు చోరీ..

నవాబ్‌పేట, అక్టోబరు 5 : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తాళాలు పగులగొట్టి నగదు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని యన్మనగండ్లలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బాయిండ్ల వెంకటయ్య వేరే గ్రామానికి వెళ్లగా, కూతురు ఆదివారం ఉదయం కూలీ పనులకు వెళ్లింది. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువ తాళాలు పగులగొట్టి రూ.1.50లక్షల నగదు, 30 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన కూతురు నిఖితకు ఇంటి పక్కల వారు సమాచారం ఇవ్వడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా నగదు, ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చింది. వెంకటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

రాజాపూర్, అక్టోబరు 6: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవి ఆదివారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలోని మల్లేపల్లి రోడ్డులో ట్రాక్టరు, కుచ్చర్‌కల్ శివారులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను శనివారం అర్ధరాత్రి, ఆదివారం ఉదయం బ్లూకోర్టు సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హన్వాడ, అక్టోబరు 6: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడలో ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను అధికారులు కూల్చివేశారు. అక్రమంగా వేసిన డబ్బాలను తొలగించారు. గత పాలకులు ఇచ్చిన అనుమతులపై కొందరు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వాటిని తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది తొలగించి, గ్రామ కంఠం భూమిని చదును చేశారు. ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో ఎవరూ నిర్మాణాలు చేయొద్దని అధికారులు కోరారు.

మైనార్టీలను సెకండ్ సిటిజన్స్ చేసే కుట్ర



మాట్లాడుతున్న మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్, చిత్రంలో పలువురు ప్రతినిధులు

- అలిగఢ్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్
- కొనసాగిన ఆల్ ఇండియా తంజీమే- ఈ- ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు

పాలమూరు, అక్టోబరు 6 : భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో ముస్లిం, క్రిస్టియన్, బౌ ద్ధ, జైన తదితర మైనారిటీల వర్గాల ప్రజలను సెకండ్ సిటిజన్స్ చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అలిగడ్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ మధిహురుల్ రెహమాన్ షేర్వాని సాబ్ విమర్శించారు. ఆల్ ఇండియా తంజీమే - ఈ - ఇన్సాఫ్ జాతీయ సమితి సమావేశాలు ఆదివారం రెండో రోజు జిల్లా కేంద్రంలో కొనసాగాయి. మతోన్మాద మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత ఛాందస విధానాలను వేగంగా రాజకీయ ప్రభుత్వ రంగాల్లో విస్తరింపజేసి మత ప్రాతిపదికన ప్రజలను విభజిస్తూ మత ఘర్షణలకు సంఘపరివార్ శక్తులకు ఆజ్యం పోస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, దేశసమగ్రతను ఔన్నత్యాన్ని దెబ్బతీసే విధంగ కేంద్ర ప్రభుత్వ పాలన విధానాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్టు-2024 అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనారిటీల హక్కులను కాలరాసే విధంగ కేంద్ర ప్రభుత్వం వ్యవహరించే తీరును ఆయన తప్పుపట్టారు. ప్రధాని తప్పుడు విధానాలతో దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పార్లమెంట్‌లో బలం ఉందనే అహంకారంతో వక్ఫ్ చట్టానికి సవరణలు చేసినా ప్రజాబలంతో తిరిగి మైనారిటీ హక్కులను కాపాడుకునేందుకు ఏమాత్రం వెనుకడుగు వేయమన్నారు. దేశంలో మైనారిటీలను రెండో తరగతి పౌరులుగా విభజించి వారి ఆస్తులను దుర్మార్గంగా లాక్కోవాలని దురుద్దేశంతో కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. మైనారిటీల ఆస్తులను హరించే విధంగా మోదీ సర్కారు వ్యవహరిస్తోందని రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మైనారిటీల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆల్ ఇండియా తంజీమే -ఈ- ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్ పాష, ఇన్సాఫ్ జాతీయ గౌరవ అధ్యక్షుడు అహ్మద్ షేర్వానీ, ఇర్ఫాన్ ఆలం, ఇస్లామోద్దీన్, షేకిబుల్ రహమాన్, నవాబ్, నూనినిసాన్, ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజ్, మునీర్‌పటేల్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు యం.బాలనరసింహ, జిల్లా కార్యదర్శి బి.బాలకిషన్, డి.రాము, రాజు, శంకర్, సత్యనారాయణరెడ్డి, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్పా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం : ఎస్పీ

నారాయణపేట, అక్టోబరు 6 : మహిళల రక్షణే షీ టీం ప్రధాన లక్ష్యమని ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, బాలికలు, ఆకతాయిల వల్ల లేదా మరే విధంగానైనా వేధింపులకు గురైతే నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలన్నారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని గృహ హింసకు గురైనా ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు బస్టాండ్ వద్ద, గ్రామాలు, కాలనీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైనా, మహిళలు పనిచేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా, బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీటీంను ఆశ్రయిస్తే ఆశ్రయిస్తే న్యాయం చేకూర్చుతామన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పల్లి సాగులో రైతులు బిజీ.. బిజీ

▸ పేట మండలంలో 900 ఎకరాల్లో సాగయ్యే అవకాశం



బోయిన్‌పల్లిలో పల్లీ విత్తడానికి పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

నారాయణపేట రూరల్, అక్టోబరు 6 : నారాయణపేట మండల వ్యాప్తంగా పల్లి విత్తనాల సాగులో రైతులు బిజీ బిజీగా కానవస్తున్నారు. కర్నూల్ జిల్లా ఆళగడ్డ నుంచి మేలు రకమైన విత్తనాలు కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇది వరకే దుక్కిదున్ని పొతం చేసిన పొలాల్లో పల్లి విత్తనాలు విత్తేందుకు పనులు మొదలు పెట్టారు. పల్లి విత్తనాలను క్వింటాలుకు రూ.12,200 తోపాటు ట్రాన్స్‌పోర్ట్, డీఏపీలతో కలిపి రైతులకు ఎకరాకు రూ.18వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టుకుంటున్నారు. విత్తనాలు విత్తేందుకు గడేలకు రోజుకు రూ.1500 నుంచి రూ.రెండు వేల వరకు వెచ్చిస్తున్నారు. గతేడాది 2023-24 రబీలో పల్లి సాగుకు సాధారణ విస్తీర్ణం 1,327 ఎకరాలు అనుకూలంగా ఉండగా, 536.30 ఎకరాల్లో రైతులు సాగు చేసుకున్నారు. అయితే ఈ సారి 2024-25లో దాదాపు 900 ఎకరాల్లో పల్లి సాగయ్యే అవకాశముందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. ఇక పోతే రైతులకు ఈ సారి పంటలకు కావాల్సిన డీఏపీ మార్కెట్‌లో అందుబాటులో ఉండటంతో ఎటువంటి ఇబ్బంది లేకుండా పల్లి పంటల సాగుకు రైతులు ముందుకు వెళ్తున్నారు. పల్లి విత్తడం పూర్తయ్యాక కొద్దిమేర వర్షాలు వెంటనే రాకపోతే రైతులు సాగు చేసిన పంటలు మొలకెత్తే అవకాశం మెండుగా ఉంటుంది. కాగా పల్లి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు

నారాయణపేట రూరల్, అక్టోబరు 6 : మండలంలోని చిన్నజట్రం గ్రామంలో ఆదివారం సాయంత్రం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మద్దలేశ్వరి మాత ఆలయం దగ్గర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారులు, మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అలంకరించి తలపై పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బతుకమ్మలను ఆలయ ఆవరణలో ఉంచి చుట్టూ బతుకమ్మ పాటలతో నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. అనంతరం సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కొత్తపల్లి, అక్టోబరు 6 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నిడ్జింత పాఠశాల క్రీడా మైదానంలో ఏకే వాలీబాల్ అకాడమీ గుండుమాల్ మరియు నిడ్జింత పాఠశాల జట్ల మధ్య ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలకు ఆయన పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఆటలపై మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీడీ కతలప్ప, ఖదీర్, సాధిక్, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోస్గి, అక్టోబరు 6 : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన కోస్గి పట్టణంలో చోటు చేసుకుంది. వలపాలి మల్లేష్‌కు చెందిన గేదె పట్టణ శివారులోని జంగమోనికుంట వద్ద మేస్తుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్‌కు గుఐ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం ఉందని చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నారాయణపేట రూరల్, అక్టోబరు 6 : నారాయణపేట మండలంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అభంగాపూర్‌లో శెట్టి శివప్పకు చెందిన కిరాణ దుకాణంలో 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. అదే గ్రామంలో శెట్టి శేఖర్ ఇంట్లో 2.30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం 16.30 క్వింటాళ్ళ బియ్యం పట్టుకుని డీటీ పంచనామా అనంతరం స్టేషన్‌కు తరలించి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ రాముడు తెలిపారు.



పట్టుబడిన బియ్యం బస్తాలు →

ప్రమాదపు అంచున ప్రయాణం





నారాయణపేట నుంచి వివిధ గ్రామాలకు పత్తి ఏరేందుకు ప్రత్యేక వాహనాల్లో సామర్థ్యానికి మించి కూలీలను తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఆదివారం పేట శివారు మహబూబ్‌నగర్ మార్గంలో వాహనాల్లో సామర్థ్యానికి మించి కూలీలను తరలిస్తుండగా ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- నారాయణపేట



కాత్యాయనీదేవిగా పేట శక్తిపీఠం అమ్మవారు



శ్రీ సిద్ధిధాత్రీ దేవిగా పేట మలాంబికాదేవి అమ్మవారు



బాలా త్రిపుర సుందరీదేవిగా పేట బ్రాహ్మణవాడీ చౌడేశ్వరి అమ్మవారు



వన దేవత అవతారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు



కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న వాసవీమాత

కాత్యాయనీదేవిగా వాసవీ మాత

▸ కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు

▸ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు ▸ ఆయా మండపాల వద్ద అన్నదానం



మక్తల్‌లో తులాభారం నిర్వహిస్తున్న భక్తులు



స్కందమాత అవతారంలో పేట అంబాభవానీ అమ్మవారు



వాసవీ మాత ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు

నారాయణపేట/మక్తల్/దామరగిద్ద/నర్వ/ధన్వాడ/మరికల్/ఊట్కూర్, అక్టోబరు 6 : శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శక్తిపీఠంలో కాత్యాయని దేవీగా అమ్మవారు దర్శనమిచ్చారు. పేట అశోక్‌నగర్‌లోని మలాంబికాదేవి శ్రీ సిద్ధిధాత్రి దేవిగా దర్శనమిచ్చారు. పేట బ్రహ్మణవాడి చౌడేశ్వరీ ఆలయంలో బాలా త్రిపుర సుందదీ దేవిగా దర్శనమిచ్చింది. అదే విధంగా నారాయణపేట పట్టణంలోని భవానీ, చౌడేశ్వరి, బాలాజీ, రాఘవేంద్ర స్వామి, అనంతసేన ఆలయం, కాళికా మాతా, మరిగమ్మ, శక్తిపీఠంలో ఉత్సవాలు కొనసాగాయి. మడి ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం చేశారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ నందునామాజీ, అప్పిరెడ్డిపల్లి రాము పాల్గొన్నారు.

- మక్తల్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం వాసవీమాత కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద అమ్మవారికి తులాభారం కార్యక్రమం నిర్వహించారు. ఓవైపు అమ్మవారిని ఉంచి మరోవైపు నాణేలు, పళ్లు, బెల్లంతో తులా భారం నిర్వహించారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నల్లజానమ్మ ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా ఆలయాల వద్ద గణపతి ప్రార్థన, సామూహిక కుంకుమార్చన, సాయంత్రం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

- దామరగిద్ద మండల కేంద్రంలోని భవానీ మాత ఆలయం, గాంధీనగర్‌తో పాటు వాసవీ మాత ఆలయంలో నాల్గవ రోజు వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు వనదేవత రూపంలో దర్శనమిచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. దేశాయిపల్లి, బాపన్‌పల్లి, కానుకూర్తితో పాటు కర్ణాటక సరిహద్దు సూర్యనంది క్షేత్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- నర్వ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ విగ్రహాలకు ఆదివారం నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్రెమ్మ గుడి, తిలక్‌నగర్, లంకాల, రాయికోడ్, పాతర్‌చెడ్ గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ధన్వాడ మండల కేంద్రంలోని రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతతో పాటు వాయుపుత్ర సంఘం, దత్తాత్రేయ ఆలయం, గంగామాత ఆలయం, తుల్జామాత ఆలయం వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- మరికల్ మండల కేంద్రంలో భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీ లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమించ్చింది. ఈ సందర్భంగా వీరశైవ లింగాయత్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కాకుల శివకుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అశోక్‌గౌడ్ దంపతులు, వీరన్న దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీరోజు ఉదయం ఐదు గంటలకు హోమం, 11 గంటలకు అమ్మవారికి అభిషేకం, సాయంత్రం బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నారు. బతుకమ్మ ఆడిన మహిళలకు లక్కీడిప్ ద్వారా వచ్చిన మహిళలకు అమ్మవారి చీరలను బహూకరిస్తున్నారు. అయ్యప్ప అడ్వకేట్, జగదీశ్వర్, తిప్పయ్య, బస్వరాజ్, శంకరప్ప పాల్గొన్నారు.

- ఊట్కూర్ మండలంలోని బిజ్వార్ గ్రామంలోని అంబాత్రాయ క్షేత్రంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నవి. ఆదివారం నాల్గవ రోజు దుర్గామాత కూష్మాండ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం శతచండీ హోమం, లక్ష తులసీ అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 108 అఖండ జ్యోతులు, 74 వివిధ రకాల హారతులతో స్వామి ఆదిపరాశ్రీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయ ప్రాంగణంలో దాండియా నృత్య ప్రదర్శన నిర్వహించారు. అదే విధంగా మండల కేంద్రంలోని భవానీ మందిరంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతీ, యువకులు అమ్మవారికి పూజలు చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న స్వామి ఆదిపరాశ్రీ



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి



ఊట్కూర్ భవానీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

డాక్టర్లపై భౌతిక దాడులు దురదృష్టకరం

▸ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట, అక్టోబరు 6 : సమాజ సేవలో డాక్టర్లు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వైద్యులపై కొందరు భౌతిక దాడులకు పాల్పడడం దురదృష్టకరమని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. నారాయణపేట ఎస్ఆర్ గార్డెన్‌లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ భాగ్యనగర్, టిఎక్స్ హస్పిటల్ హైదరాబాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ దామరగిద్ద సంయుక్త ఆధ్వర్యంలో మెగాహెల్త్ క్యాంపును ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించిన లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం అన్నారు. విరివిగా సేవా భావంతో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ వృత్తి పవిత్రమైందని సేవా భావంతో వైద్యులు పనిచేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు చేయడమే కాకుండా డాక్టర్‌గా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందన్నారు. అనంతరం వైద్యులను సన్మానించగా, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డాక్టర్ విశ్వజిత్‌రెడ్డి దంపతులను లయన్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. పాస్ట్ గవర్నర్ హరినారాయణ భట్టడ్, దామరగిద్ద లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమయ్య గౌడ్, పేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, సభ్యులు ఆత్మరాం, రవిగౌడ్, రాంచందర్ గౌడ్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, మాజీ చెర్మన్ల బండి వేణుగోపాల్, సరాఫ్ నాగరాజ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, నాయకులు మనోహర్‌గౌడ్, గందె చంద్రకాంత్, సతీష్‌గౌడ్, కార్తీక్, సుభాష్, వెంకటయ్య, కుర్వ మనోజ్, అభిలాష్, రామ్‌గోపాల్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పర్ణికారెడ్డి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ఆటల్లో గెలుపోటములు సహజం

ధన్వాడ : ఆటల పోటీల్లో గెలుపోటములు సహజం అని, చదువుకునే రోజుల్లో నేను సైతం ఆటలు ఆడాను. ఓడి పోయినా బాధపడకుండా గెలుపు కోసం ప్రయత్నించానని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన ధన్వాడలో ఆదివారం నిర్వహించిన క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓడిపోయిన క్రీడాకారులు నిరుత్సాహపడరాదని, గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. ఆదే సమయంలో క్రీడాకారులు సంయమనం పాటించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకొని, బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రికెట్ పోటీలను ఆర్గనైజింగ్ చేసిన క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో చిట్టెం మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గున్ముక్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి, నాయకులు చీరాల సుధాకర్‌రెడ్డి, కందనూర్ రహిమన్‌ఖాన్, మార్కెట్ యార్డు డైరెక్టర్లు నీరటి రాంచంద్రయ్య ముదిరాజ్, జట్రం లక్ష్మయ్యగౌడ్, చిట్టెం రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో 4,03,748 ఓటర్లు

▸ పురుష ఓటర్లు 1,98,199 మంది, మహిళలు 2,05,547, ఇతరులు ఇద్దరు

▸ 7,348 మంది మహిళా ఓటర్లే అధికం

నారాయణపేట, అక్టోబరు 6 : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారులు సెప్టెంబరు 28న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. జిల్లా పంచాయతీ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డులపై ముసాయిదా జాబితాను పొందుపరిచారు. గత అసెంబ్లీ ఎన్నికల ప్రమాణికంగా 2024 ఫిబ్రవరిలో ప్రచురించిన తుది జాబితా ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు గత నెల 13న ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించారు. ఇందులో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓట్లను పంచాయతీల్లో వార్డుల వారిగా విభజించారు. ఇందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే గత నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు వాటిని పరిష్కరించి, సెప్టెంబరు 28న తుది జాబితాను ప్రచురించారు. జిల్లా వ్యాప్తంగా 280 గ్రాయ పంచాయతీలు ఉండతా, 2,544 వార్డులు ఉన్నాయి. ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం ఓటర్లు 4,03,748 ఉండగా, అందులో పురుషులు 1,98,199 మంది ఓటర్లు, మహిళా ఓటర్లు 2,05,547 మంది ఉండగా, ఇతరులు ఇద్దరు ఉన్నారు. కాగా పురుషుల కంటే మహిళా ఓటర్లు 7,348 మంది అధికంగా ఉన్నారు. అయితే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ఎన్నికల సంఘం 18ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేసుకొనేందుకు వెసులు బాటు కల్పించింది. జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్ల నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.



దామరగిద్దతండాలో ఓటరు జాబితాను సరిచూసుకుంటున్న గ్రామస్థులు

ఆర్థిక సాయం అందజేత

మక్తల్, అక్టోబరు 6 : మక్తల్ పట్టణంలోని వినాయక్‌నగర్‌లో ఆదివారం సురక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ పేద కుటుంబానికి రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. వినాయక్‌నగర్‌కు చెందిన నర్సిములు కుమారుడు అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సురక్ష ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సురక్ష ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, లింగారెడ్డి, వాహిద్, శివరాజ్, పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

నర్వ, అక్టోబరు 6 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990-91 బ్యాచ్ పదో తరగతికి పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలోనే సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు కొంత ఆర్థిక సాయంతో పాటు పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మాణించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రమేష్, బాలప్ప, మాసన్న, నర్సింములు, రుక్మోద్దీన్, శ్రీనివాస్‌రారావు, మన్నాజీ, అయ్యన్న, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

విజయవంతమైన కంటి వైద్య శిబిరం

కృష్ణ, అక్టోబరు 6 : మండలంలోని తంగడిగి గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైనట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా కేంద్రంలోని మీనాక్షి కంటి వైద్య ఆసుపత్రి ప్రదీప్, ఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వీరాంజనేయ ఆలయ ఆవరణలో 200 మందికి కంటి చికిత్స చేసినట్లు డాక్టర్లు తెలిపారు. అనంతరం కంటి వైద్యులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు.

పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేద్దాం

నారాయణపేట, అక్టోబరు 6 : హైదరాబాద్‌లో సోమవారం నుంచి కొనసాగే పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేద్దామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు ఉపాధ్యాయుల సమస్యలపై పరిష్కారం కోసం చర్చించడం జరుగుతుందన్నారు. అదే విధంగా రాబోయే రెండు సంవత్సరాల పాటు నూతన కార్యవర్గం ఎన్నికలు జరుగుతాయన్నారు. సమావేశానికి జిల్లా నుంచి పీఆర్టీయూ జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని కోరారు.

చోరీకి వచ్చి రాళ్లు విసిరిన దుండగులు

కృష్ణ, అక్టోబరు 6 : చోరీకి పాల్పడేందుకు వచ్చిన వారిని గ్రామస్థులు గుర్తించి వెంబడించారు. వెంటనే వారు రాళ్లతో గ్రామస్థులపై దాడి చేసి పారిపోయారు. మండలంలోని గుడెబల్లూరులో శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుడు వడ్వాట్ రాము తెలిపిన వివరాల ప్రకారం బొలెరో వాహనంలో గుర్తు తెలియని పది మంది మాస్కులు ధరించి ఆయుధాలు, రాడ్లతో మధ్య రాత్రి పంట పొలాల నుంచి గ్రామంలో ప్రవేశించగా అనుమానం వచ్చిన గ్రామస్థులు వెంటపడి కేకలు వేసినట్లు తెలిపారు. గ్రామస్థులపై రాళ్లతో దాడి చేసి టై రోడ్డు మీదుగా వెళ్లినట్లు పేర్కొన్నారు. అదే విధంగా పంట పొలాల్లో గుడిసెల్లో కట్టేసిన ఎద్దుల తాళ్లు తెంచి వేసిన విషయం తెలుసుకున్న రైతులు దుండగుల వెంట పడినా పొలాల్లో పడి పారిపోయినట్లు రైతులు తెలిపారు. జాతీయ రహదారితో పాటు మారుమూల గ్రామాల్లో రాత్రి పూట పెట్రోలింగ్ చేయాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.